# నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, ఆదివారం 22 డిసెంబర్ 2024 VIKARABAD




### ఆక్రమణల తొలగింపు

మండలంలోని తోలుకట్టా గ్రామ రెవెన్యూలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వేనంబర్ 140లో అక్రమంగా ఏర్పాటు చేసిన పలు డబ్బాలను రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తమ సిబ్బందితో తొలగింపజేశారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. -మొయినాబాద్, డిసెంబర్ 21



గాయత్రి నర్సింగ్ హోమ్ దవాఖానలో ప్రసవాల వివరాలు తెలుసుకుంటున్న వికారాబాద్ డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్ (ఫైల్)

## అప్పులు తెచ్చి, బంగారాన్ని తనఖా పెట్టి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టిన మాజీ సర్పంచ్‌లు

# మాజీల గోడు.. వినేదెవరూ..

- ప్రభుత్వం మారడంతో నిలిచిన పెండింగ్ బిల్లులు
- పంచాయతీల్లో నిధులున్నా చెల్లింపులు చేపట్టొద్దని ట్రెజరీలకు సర్కారు ఆదేశాలు
- బిల్లులను వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల పోరుబాట
- అయినా స్పందించని ప్రభుత్వం
- రంగారెడ్డి జిల్లాలో రావాల్సిన బకాయిలు సుమారు రూ.80 నుంచి రూ.90 కోట్లు

జిల్లాలో పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు పోరుబాట పట్టినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల నిమిత్తం ప్రొసీడింగ్‌లు ఇచ్చి నిధులను కేటాయించింది. దీంతో అప్పటి సర్పంచ్‌లు పల్లెల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, అంతర్గత, కాలనీల మధ్య సీసీ రోడ్లు తదితర పనులను చురుగ్గా చేపట్టారు. అయితే అసెంబ్లీ ఎన్నికలు వచ్చి.. ప్రభుత్వం మారి.. కొత్తగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నిధుల విడుదలను పూర్తిగా నిలిపేసింది. గ్రామపంచాయతీల్లో నిధులున్నా ఎలాంటి చెల్లింపులు చేయొద్దని ట్రెజరీలకు ఆదేశాలిచ్చింది. దీంతో తాము చేపట్టిన పనులకు బిల్లులివ్వాలంటూ గత సర్పంచ్‌లు ఆందోళన బాటపట్టారు. తమకు రావల్సిన పెండింగ్ బిల్లులను ఇవ్వాలని ముఖ్యమంత్రి, మంత్రులకు పలుసార్లు వినతిపత్రాలను అందజేశారు. అయినా వారి గోడు ఎవరికీ పట్టడం లేదు. అప్పులు చేసి.. బంగారాన్ని తనఖా పెట్టి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని.. పెండింగ్ నిధులను విడుదల చేయకుంటే తాము రోడ్డున పడుతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారుగా రూ.80 నుంచి రూ.90 కోట్ల బకాయిలు ఉన్నట్లు సమాచారం.

-రంగారెడ్డి, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ)




### మారిన ప్రభుత్వం.. నిలిచిన పనులు

జిల్లాలోని 21 మండలాల్లోని 549 గ్రామపంచాయతీల్లో పెండింగ్ బిల్లులు పేరుకుపోయాయి. గత సర్పంచ్‌లు గ్రామాల్లో పంచాయతీ నూతన భవనాలు, కమ్యూనిటీ హాల్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీరోడ్లు, వైకుంఠధామాలు వంటి పలు పనులను చేపట్టారు. గత కేసీఆర్ ప్రభుత్వం నిధులను విడుదల చేసి ప్రొసీడింగ్‌లూ కేటాయించింది. అయితే ప్రభుత్వం మారి.. నిధులు విడుదల కాకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో మాజీ సర్పంచ్‌లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

### కొనసాగుతున్న మాజీ సర్పంచ్‌ల పోరుబాట

తాము చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులను చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు గతేడాదిగా పోరుబాట కొనసాగిస్తున్నారు. తమ పదవీకాలం ముగిసిన వెంటనే పంచాయతీల చెక్ పవర్‌ను సెక్రటరీలకు కేటాయించటంతో పెండింగ్ బిల్లులను ఎవరిని అడగాలో తెలియని అయోమయ పరిస్థితి వారిలో నెలకొన్నది. కొన్ని పంచాయతీల్లో నిధులున్నా పెండింగ్ బిల్లులను చెల్లించొద్దని ప్రభుత్వం ట్రెజరీలను ఆదేశించడంతో ఆ ప్రక్రియ అక్కడే ఆగిపోయింది. దీంతో మాజీ సర్పంచ్‌లు ఏడాదిగా పోరాటాన్ని కొనసాగిస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన రావడం లేదు.



### అప్పులు తెచ్చి పనులు చేపట్టా..

తన హయాంలో గ్రామం అభివృద్ధి చెందాలని.. అప్పులు తెచ్చి.. బంగారాన్ని బ్యాంకుల్లో తనఖా పెట్టి డబ్బులు తీసుకొచ్చి పనులు చేపట్టా. చేపట్టిన పనులకు దాదాపుగా రూ.30 లక్షల వరకు రావాల్సి ఉన్నది. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని పలు మార్లు ముఖ్యమంత్రి, మంత్రులను కోరినా ప్రయోజనం లేదు. ఆందోళన చేసేందుకు వెళ్తే మమ్ముల్ని అడ్డుకుని ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించాలి. -గంగిరెడ్డి బల్వంత్‌రెడ్డి, రాయపోల్ మాజీ సర్పంచ్

### బిల్లులు చెల్లించమంటే అరెస్టు చేస్తున్నారు..

బీఆర్ఎస్ హయాంలో అనేక అభివృద్ధి పనులకు ప్రొసీడింగ్‌లు అందాయి. ప్రభుత్వం అందజేసిన ప్రతి ప్రొసీడింగ్‌కూ ఎప్పటికప్పుడు నిధులను విడుదల చేయడంతో గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకెళ్లాయి. అయితే ప్రభుత్వం మారి.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులను చెల్లించడం లేదు. చెల్లించమని ఆందోళన చేపడితే ముందస్తుగా పోలీసులతో అరెస్టులు చేయిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించి ఆదుకోవాలి. -చిలుకల యాదగిరి మాజీ సర్పంచ్, తులేకలాన్..



# కడుపు కోతలు

- ధనార్జనే ధ్యేయంగా కాన్పులు చేస్తున్న పలు ప్రైవేట్ దవాఖానలు
- సాధారణ డెలివరీలకు అవకాశమున్నా.. సీ-సెక్షన్‌కే ప్రాధాన్యం

వికారాబాద్ జిల్లాలో 'కడుపుకోత'లు జోరుగా సాగుతున్నాయి. కొన్ని ప్రైవేట్ దవాఖానల యాజమాన్యాలు కాసులకు కక్కుర్తిపడి సిజేరియన్లకు తెగబడుతున్నాయి. సాధారణ కాన్పులకు అవకాశమున్నా.. ఏదో ఒక సాకు చెబుతూ అందినకాడికి దండుకుంటున్నాయి. కడుపులో బిడ్డ ఉమ్మనీరు తాగిందని.. అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని, లేదంటే తల్లీబిడ్డలకు ప్రమాదమని చెప్పి గర్భిణుల బంధువులను భయపెట్టేస్తున్నాయి.

-వికారాబాద్, డిసెంబర్ 21



దవాఖానలకు వచ్చే గర్భిణులకు వీలైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. అయితే అవి ప్రభుత్వ ఆస్పత్రులకే పరిమితమవుతున్నాయి. ప్రైవేట్ దవాఖానలు పట్టించుకోవడంలేదు. వికారాబాద్ జిల్లాలో దవాఖానలు, ల్యాబ్‌లు అన్నీ కలిపి దాదాపుగా 180 వరకు ఉన్నట్లు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ఈ సంవత్సరం ఒక్క నవంబర్ నెలలోనే జిల్లాలోని అన్ని ప్రైవేట్ దవాఖానల్లో దాదాపుగా 320 డెలివరీలు జరిగాయి. అందులో 43 సాధారణ ప్రసవాలు కాగా మిగిలిన 277 సిజేరియన్లు ఉన్నాయి. ప్రైవేట్ దవాఖానల నిర్వాహకులు అధికంగా 'కడుపుకోత'లను ప్రోత్సహిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతున్నది. 2024 జనవరి నుంచి నవంబర్ నెలాఖరు వరకు జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో 5,596 నార్మల్ డెలివరీలు, 3,352 సిజేరియన్లు జరిగాయి. అదేవిధంగా ప్రైవేట్ దవాఖానల్లో 637 సాధారణ ప్రసవాలు కాగా.. 2,851 సిజేరియన్లు అయ్యాయి. జిల్లాలోని ప్రైవేట్ హాస్పిటల్స్‌లో సాధారణ ప్రసవాలకు అవకాశమున్నా చేయడం లేదు. కడుపులో బిడ్డ ఉమ్మనీరు తాగిందని.. అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని, లేదంటే తల్లీబిడ్డలకు ప్రమాదమని చెప్పి గర్భిణుల బంధువులను భయపెట్టేస్తున్నారు. వైద్యులు చెప్పినట్లు చేయకపోతే తల్లీబిడ్డకు ఏమవుతుందోనన్న ఆందోళనలో కుటుంబ సభ్యులు వారు చెప్పినట్లు నడుచుకుంటున్నారు. నార్మల్ డెలివరీ చేస్తే తక్కువ ఫీజు వస్తుందని, సిజేరియన్ అయితే ఎక్కువ సొమ్ము వసూలు చేయొచ్చని కొందరు వైద్యులు ఆపరేషన్లకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మే 29న వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్, ఎంసీహెచ్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సాయిబాబా, డిప్యూటీ మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు జిల్లా కేంద్రంలోని గాయత్రి నర్సింగ్ హోమ్‌ను తనిఖీ చేయగా.. అక్కడ జరిగిన ప్రసవాల్లో అధికంగా సీ-సెక్షన్ కేసులు (సిజేరియన్లు) ఉన్నట్లు వారి దృష్టికి వచ్చింది. రోగుల కేస్ షీట్స్ కూడా అసంపూర్తిగా ఎంట్రీ చేసినట్లు గుర్తించి.. అసలేం జరుగుతున్నది.

### సీ-సెక్షన్‌ను ప్రోత్సహించొద్దు

ఎక్కువగా సీ సెక్షన్లు ఎందుకు జరుగుతున్నాయని నిర్వాహకులకు జిల్లా వైద్యాధికారులు నోటీసులు జారీ చేశారు. గైనకాలజిస్టులు సాధ్యమైనంత వరకు నార్మల్ డెలివరీలు జరిగేలా చొరవ తీసుకోవాలని.. సిజేరియన్ ప్రసవాలను ప్రోత్సహించొద్దని సూచించారు. పేషెంట్ కేస్ షీట్‌లో పూర్వ, ప్రస్తుత గర్భస్థ చరిత్ర, అలాగే ఆపరేషన్ థియేటర్ నోట్స్, చికిత్స, డిశ్చార్జి సమ్మరీ కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన గైనకాలజిస్ట్, ఆసుపత్రి యజమాన్యంపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.




రంగారెడ్డి కలెక్టర్ ఎదుట నల్లటి దుస్తులు ధరించి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

# క్రమబద్ధీకరించాల్సిందే..

- 16వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన దీక్షలు
- ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్

ఆదిబట్ల, డిసెంబర్ 21 : విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం.. వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గం శ్రీను డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వంలోకి వెంటనే తీసుకోవాలని ఉద్యోగులు రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాటికి 16వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు నల్లని దుస్తులు ధరించి నిరసన తెలిపారు. అనంతరం దుర్గం శ్రీను మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా అభద్రతాభావంతో చాలీచాలని వేతనాలతో జీవితాలను వెల్లదీస్తున్నారని.. ఎన్ని ప్రభుత్వాలు మారినా వారికి అన్యాయమే జరుగుతున్నదన్నారు. రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన ప్రకారం ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. దీక్షలో కూర్చున్న వారిలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అజీజ్, ప్రధాన కార్యదర్శి సంపత్, కోశాధికారి సాయికుమార్, మహిళా నాయకులు శ్రీలత, పద్మ, భార్గవి, సుజాత, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

### చాకలి ఐలమ్మ వేషధారణలో ..

వికారాబాద్ : తమ డిమాండ్ల సాధన కోసం గత 16 రోజులుగా నిరసన దీక్షలు చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడంతో శనివారం ఒక సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగిని చాకలి ఐలమ్మ వేషధారణలో నిరసన తెలిపారు. ఐలమ్మ స్ఫూర్తితో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తమను విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ వేషధారణలో ఉద్యోగిని

## రోగం ఒకటి- మందు మరొకటి

- రామయ్యగూడ పీహెచ్‌సీకి వెళ్లిన పేషెంట్‌కు ఇచ్చిన నర్సు
- సోషల్ మీడియాలో వైరల్.. మెమో జారీ చేసిన అధికారులు

వికారాబాద్, డిసెంబర్ 21 : జిల్లా కేంద్రం, రామయ్యగూడ సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక దవాఖాన(పీహెచ్‌సీ)లో శనివారం రోగం ఒకటి ఉంటే.. మందు మరొకటి ఇచ్చిన ఘటన వెలుగు చూసింది. ఉదయం 11 గంటల ప్రాంతంలో తేజస్విని అనే పేషెంట్ తనకు జ్వరం వచ్చిందని దవాఖానకెళ్లగా.. అక్కడ ఆ సమయంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో నర్సు.. జ్వరానికి ఇవ్వాల్సిన మాత్ర కాకుండా అధిక రక్తపోటుకు ఇవ్వాల్సిన మాత్రలు ఇచ్చింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారులు స్పందించారు. ఈ విషయంపై వికారాబాద్ డీఎంహెచ్‌వో వెంకటరమణ వివరణ కోరగా.. డ్యూటీ డాక్టర్ సెలవులో ఉండడంతో నర్సు వచ్చిన రోగులను చూసిందని.. ఈ విషయం తెలియడంతో విచారించి, నర్సుకు మెమో ఇచ్చామని ఆయన చెప్పారు.

హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం,



## ప్రభుత్వ వైఫల్యంతోనే ఆలయాలపై దాడులు

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఆందోళన
- కిలోమీటర్ మేర నిలిచిపోయిన వాహనాలు
- నిందితులను త్వరగా గుర్తించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్

మొయినాబాద్, డిసెంబర్ 21 : ప్రభుత్వ వైఫల్యంతోనే ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. దేవుళ్ల విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి శిక్షించకపోవడంతోనే దాడులు పునరావృతం అవుతున్నాయన్నారు. మండలంలోని తోలుకట్టా గ్రామ గేట్ వద్ద హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలోని విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి ధ్వంసం చేసిన విషయాన్ని తెలుసుకున్న చేవెళ్ల ఎంపీ శనివారం మధ్యాహ్నం ఆలయానికి చేరుకుని విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర నాయకులు అంజన్‌కుమార్ గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, ప్రకాశ్, గోపాల్‌రెడ్డి, గణేశ్, గ్రామస్తులు, అధిక సంఖ్యలో తరలివచ్చిన హిందువులతో కలిసి ఆయన బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో రోడ్డుపై కిలోమీటర్ వరకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుం డా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ గౌతమ్‌కుమార్ సంఘటనాస్థలానికి చేరుకుని ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలించి పంచనామా చేసి పోలీసులకు అందించగా వారు కేసు నమోదు చేశారు. నిందితులను గుర్తించేందుకు పోలీసులు క్లూస్ టీంను రంగంలోకి దింపారు. నిందితులను త్వరగా గుర్తించాలని రెవెన్యూ, పోలీసు అధికారులను కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. అవసరమైతే రాష్ట్ర డీజీపీ, కలెక్టర్‌తో మాట్లాడుతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రవీందర్, అధిక సంఖ్యలో హిందువులు, స్థానికులు పాల్గొన్నారు.

## వెయ్యికొట్టు..
# స్మార్ట్ కార్డు పట్టు

- పోస్టల్ శాఖకు బిల్లులు చెల్లించని ఆర్టీఏ
- సేవలు నిలిపివేసిన పోస్టల్ శాఖ
- ఇదే అదునుగా చెలరేగిపోతున్న ఏజెంట్లు
- డబ్బులిస్తే.. నేరుగా కార్డులు

సిటీబ్యూరో, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ఆర్టీఏ కార్యాలయాల్లో స్మార్ట్ కార్డులు గుట్టలుగా పేరుకుపోయాయి. వాహనదారులకు అందాల్సిన కార్డులు రెండు, మూడు నెలలు గడుస్తున్నా అందడం లేదు. తమ కార్డు ఎప్పుడొస్తుందోనని వాహనదారులు ఎదురుచూస్తున్నారు. కానీ అధికారులు ఆ కార్డులను చిరునామాలకు చేర్చాల్సి ఉన్నా.. చేర్చకపోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేందని అధికారులను అడిగితే కార్డు ప్రాసెసింగ్‌లో ఉందని.. పూర్తయ్యాక ఇంటికి వస్తుందని చెబుతున్నారు. కానీ అసలు విషయం పోస్టల్ శాఖకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించకపోవడంతో పోస్టల్ శాఖ తమ సేవలను నిలిపివేసింది. 'ముందు బిల్లులు క్లియర్ చేసుకోండి.. అంతవరకు పోస్టల్ సేవలు' అందవని రవాణా శాఖకు తేల్చి చెప్పింది. ఆర్‌సీ, లైసెన్స్ తదితర రిజిస్ట్రేషన్ కార్డులన్నీ వినియోగదారుల చిరునామాకు చేర్చేది పోస్టల్ శాఖనే. దీంతో రవాణా అధికారులు సైతం మిన్నకుండిపోయారు. ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఈ ప్రక్రియలో ఏజెంట్లు కార్డు కావాలంటే వెయ్యి నుంచి రెండు వేల వరకు వాహనదారుల నుంచి వసూలు చేస్తున్నారు.

### 10 రోజుల్లో ఇంటికి చేరాల్సి ఉన్నా..

గ్రేటర్‌లో 12 రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో అధికంగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కార్యాలయాల్లో స్మార్టు కార్డులు పేరుకుపోయాయి. ఇప్పటికే 17వేల కార్డులు కార్యాలయాల్లోనే ఉన్నాయని ఓ అధికారి తెలిపారు. ఒక్క రోజుకు రిజిస్ట్రేషన్ల కోసం ఒక్క కార్యాలయానికి 80 నుంచి 200 వరకు వాహనాలు వస్తుంటాయి. కార్డులన్నీ 7-10 రోజుల్లోపు ఇంటికి చేరాల్సి ఉంటుంది. వాహనదారులు వాటికోసం ప్రతిరోజూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు ఏజెంట్లను సంప్రదించి వారు అడిగింత ఇచ్చి కార్డులను తీసుకుంటున్నారు. రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం, మేడ్చల్ ప్రధాన కార్యాలయాల్లో ఏజెంట్లు ఆడిందే ఆట పాడిందే పాటగా నడుస్తున్నది.

### అధికారుల అండదండలతో..

గ్రేటర్‌లో మేడ్చల్ ప్రధాన కార్యాలయం, రంగారెడ్డి జిల్లాలోని మణికొండ, కొండాపూర్, ఇబ్రహీంపట్నం కార్యాలయాల్లో ఏజెంట్లు పేట్రేగిపోతున్నారు. ప్రత్యామ్నాయ ఆర్టీవోలుగా వ్యవహరిస్తూ వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నారు. సేవలు సకాలంలో అందాలన్నా.. కార్డులు వెంటనే పొందాలన్నా వారు నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించాల్సిందే. ప్రమోద్ అనే వ్యక్తి మణికొండ కార్యాలయంలో తన వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకుని రెండు నెలలకు పైగా అయింది. ఇప్పటికీ అతడికి ఆర్‌సీ ఇంటికి చేరలేదు. ఈ విషయంపై ఆరా తీయగా కార్డు ప్రాసెస్‌లో ఉందని అధికారులు బుకాయించారు. అదేవిధంగా ప్రమీల అనే యువతికి 2 నెలలు దాటినా కార్డు ఇంటికి చేరలేదు. దీంతో ఆమె ఏజెంట్లను ఆశ్రయించి వారు అడిగిన డబ్బులు ఇవ్వగానే కార్డును చేతుల్లో పెట్టారు. ఇక చేసేదేమీ లేక వాహనదారులందరూ ఏజెంట్లను ఆశ్రయించే పరిస్థితి వచ్చింది. ఈ కార్యాలయాల్లో ఓ వైపు అధికారులు రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌లో ఉన్నా.. ఏజెంట్లు అదే కార్యాలయంలో మరోవైపు ప్రత్యామ్నాయ వేదికలు ఏర్పాటు చేసుకొని మరీ వాహనదారులకు సేవలందించడం విశేషం. ఆర్టీఏ కార్యాలయాల్లోని అవినీతి దందాపై ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



### ఉత్సాహంగా బోటింగ్

ధారూరు : మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో శనివారం సరదాగా బోటింగ్ చేస్తున్న పర్యాటకులు